# శిక్ష

వాకిట్లో అడుగుపెడుతూనే కేర్ కేర్ అని చంటిపిల్ల ఏడుపు వినిపించింది కృష్ణమూర్తికి.

సంధ్య చీకట్లలము కుంటున్నాయ్. వీధి వరండాలో గోడ మేకుకి బెడ్ లైటు తగిలించి వెళ్ళబోతూన్న పధ్నాలు గేళ్ళ అమ్మాయి వాకిట్లో అడుగుల సవ్వడి విని వెనుదిరిగి చూసింది. వెంటనే కృష్ణమూర్తికి ఎదురుగా వచ్చి పందిరి క్రింద మంచం వాల్చి కూర్చోండి అని లోపలికి వెళ్ళ బోయింది.

"అంతా కులాసానా శకుంతలా?" అడిగాడు కృష్ణమూర్తి కూర్చుంటూ. ఆ కులాసానే బావా. అని లోపలికి వెళ్ళి చెంబుతో నీళ్ళు తెచ్చి కృష్ణమూర్తి ముందుంచి కాళ్ళు కడుక్కోండి అందా అమ్మాయి.

కాళ్ళూ ముఖం కడిగి ఆ పిల్ల అందించిన తువ్వాలుతో తుడుచుకుంటూ మామయ్య ఉన్నారా? అడిగాడు కృష్ణ మూర్తి.

ఉన్నారు. నూర్పు లవుతున్నాయిగా పొలంలో ఉన్నారు. ఆ పిల్ల ఎందుకో ఏదో కంగారు పడుతూన్నట్లు కనుపిస్తూందతనికి.

మళ్ళీ మంచంమీద చతికిలబడ్డాడు కృష్ణమూర్తి. లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది శకుంతల.

ఆమె చేతిలోని గ్లాసందుకొని గటగటా తాగేసి గ్లాసు మంచంక్రింద పెట్టి వెనక్కి చేతులాన్చి కూర్చున్నాడు కృష్ణమూర్తి. లోపల చంటిపిల్ల ఏడుపు స్థాయి హెచ్చింది. కాపురమున్నారు కాబోలు ఎవరు చెప్మా వీరింట్లో చంటిపిల్ల ! తమ పెళ్ళినాటి కెవరూ కడుపుతో ఉన్నట్టు కనుపించలేదే. ఎవరన్నా తానెరుగని భార్య బంధువులు వచ్చారేమో! అనుకొని 'శకుంతలా ఎవరన్నా బంధువులు వచ్చారా ? మీ యింటికి' అడిగాడు ఆ అమ్మాయిని.

లేదండి ! అని నిలబడకుండా వెళ్ళిపోయిందా అమ్మాయి.

తాను వచ్చి పది నిమిషాలు దాటింది. ఉత్తరాలకి జవాబివ్వకపోతే పోమె, కనీసం మనిషి వచ్చినపుడయినా మాట్లాడవద్దా ! ఏమిటో ఆమె ఉద్దేశ్యం అడగాలి. అని భార్యమీద గొంతునిండా కోపంతో ఇంట్లోకి వెళ్ళాడు కృష్ణమూర్తి.

ముందుగా అతనికి భార్య మేనత్త సుందరమ్మ ఎదురయి 'ఎప్పుడొచ్చారు ? బాగున్నారా ?' ప్రశ్నించింది తడబాటుగా.

నేను వ్రాస్తూన్న ఉత్తరాలు అందుతున్నాయాండి? సూటిగా ఆమెవైపు చూస్తూ అడిగాడు కృష్ణమూర్తి.

ఆమె జవాబివ్వలేదు. విసురుగా వంటగదివైపు తప్పుకుంది.

గదిలో అడుగుపెట్టిన కృష్ణమూర్తి గతుక్కుమన్నాడు. నమ్మలేకపోయాడు. తాను కలగంటున్నాను కాబోలనుకున్నాడు. కనులు నులిపి మళ్ళీ చూశాడు. తన భార్య, తన రేణుక పసిబిడ్డకు పాలిస్తూంది. తనకూ ఆమెకూ పెళ్ళయి అయిదు నెలలు మాత్రమే అయింది. ఇప్పుడు ఇప్పుడు తను చూస్తూన్నది....అతనికి తల తిరిగినట్టయింది. కాళ్ళ క్రింది భూమి కంపించినట్లయింది. నిలవ లేనట్లు అక్కడ వాల్చి వున్న మంచంమీద చతికిలబడ్డాడు.

తల వంచి స్థాణువులా కుర్చున్న రేణుక చెంపలమీద ముత్యాల్లా కన్నీటిబొట్లు జారిపోతున్నాయ్.

కృష్ణమూర్తి గుండెల్లో లావా పొంగుతూంది. తన నెంత మోసం చేసింది. ఈమెను ఈ క్షణంలో ఇక్కడే చంపి పారిపోతే....అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయ్. అతనికి ఆమెను చూడాలంటేనే అసహ్యంగా ఉంది. ముఖం చాటు చేసుకున్నాడు.

వడిలో ఉన్న బిడ్డను చాపమీద పడుకోబెట్టి, కృష్ణమూర్తి పాదాలు తాకి చతికిలబడి కూర్చుని దుఃఖంతో సిగ్గుతో పూడిపోయే గొంతుతో 'నన్ను క్షమించండి' అంది రేణుక.

అతడు పాదాలు వెనక్కి లాక్కున్నాడు.

నేను తెలిసి తప్పు చెయ్యలేదు. మిమ్మల్ని మోస గించాలనుకోలేదు. కానీ....అని ఆగింది రెండు క్షణాలు.

తెలిసి తప్పు చెయ్యలేదంటూంది. ఏమిటో ఆ కథ వినాలనే అనుకున్నాడతను. ఆమెకు తనకు ఇటుపైన ఎటు వంటి సంబంధమూ వుండదు. ఆ నిశ్చయం ఈ గదిలో అడుగు పెడుతూనే అయిపోయింది మనసులో. ఆతనెంత నిగ్రహించుకున్నా, ఏదో కంగారుగా అవమానంగా, కోపంగా ఏదో చెయ్యాలనిపిస్తూంది ఆమెను, పీక నులిమెయ్యాలని, ఇంకా చిత్రవధ చెయ్యాలని.

పది నెలల క్రితం విశాఖపట్నం బంధువు లింటికి వెళ్లాను. నెల రోజులున్నాను. లంకాదహనం చూడాలని వెళ్లాను. అక్కడ ఎవరో నన్ను ఎత్తుకుపోయి చెరిచారు.... కాని తెలిసి నేను తప్పు చెయ్యలేదు అంది రేణుక.

ఎవరికో పుట్టిన బిడ్డను, ఈ చెడిన భార్యను వెంట పెట్టుకు వెళ్తాడా! ఛీ....అతను లేచి నిల్చుని ముందుకి నడవ బోతూంటే అతని కాళ్ళను చుట్టుకుని ఏడ్చిందామె. ఏమండీ నన్ను అన్యాయం చెయ్యకండీ. నా జీవితం నాశనం చెయ్య కండీ...............పాపను కావాలంటె....ఆమె మాట పూర్తి కాలేదు, అతని పాదం విసురుగా ఆమె మొఖాన్ని తాకింది. మొఖానికి చెయ్యాన్చుకుని, అమ్మా అందామె బాధగా. వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

అయిపోయింది. అతను క్షమిస్తాడేమో! చదువుకున్న వాడు, సంస్కారమున్నవాడూ, అనే తన ఆశ కూలిపోయింది కుమిలి కుమిలి ఏడ్చింది రేణుక.

*　*　*

మూడు సంవత్సరాలు గడిచిన తర్వాత.

నువ్వు .... నువ్వు టీచర్‌గా పనిచేస్తున్నావా ? ఆశ్చర్యంగా విస్ఫారిత నేత్రాలతో ఆమెవైపు చూస్తూ అడిగాడు శ్యామ్‌సుందర్ స్కూలు గేటు దాటుతూన్న ఆమె కెదురుగా నిల్చుని.

అలా తన ఎదర నిల్చుని చనువుగా ప్రశ్నిస్తూన్న అతనెవరో వెంటనే గుర్తు పట్టలేక తడబడింది రేణుక. అది గ్రహించిన అతను గల గల నవ్వేస్తూ నేను రేణూ! గుర్తు పట్టలా. విశాఖపట్నం మీ బంధువుల ఇంటికి తరచు వచ్చే దానవు గుర్తు తెచ్చుకో. శ్యామ్‌సుందర్‌ని. పోనీ మీ స్నేహితురాలు పార్వతి అన్నయ్యని, అన్నాడతను గబ గబా.

చప్పున గుర్తు వచ్చింది రేణుకకి. జానకిరాం బాబయ్యగారింటి పక్కనే ఉండేవారు పార్వతీవాళ్ళూ. రోజూ వాళ్ళింటికి వెళ్ళేది. బి. ఎ. చదివే పార్వతితో థర్డుఫారం మాత్రమే ప్యాసయిన తనకు చిత్రంగా స్నేహం ఏర్పడిపోయింది. వెన్నెల రాత్రుల్లో డాబామీద ఆరుబయట కూచుని కబుర్లు

చెప్పుకునేవారు. అప్పుడితను తనవైపు అదోలా చూసేవాడు. ఎందుకు తనవైపలా చూస్తాడో అర్థమయేది కాదు తనకు.

మరచిపోయూరా ? ఇంకా జ్ఞాపకం రాలేదా ? వేడివేడి బఠాణీలు తెచ్చేవాణ్ణి. వెన్నెట్లో తింటే బాగుంటాయని అన్నాడు తను మళ్ళీ.

గతంలోంచి చప్పున తేరుకొని, నమస్కారమండీ, మరేమీ అనుకోకండి. బాగున్నారా. పార్వతి బాగుందా ! రండి కాస్సేపలా కూర్చుని ఇంటికి వెళ్దాం అంటూ స్కూలు గార్డెన్ వైపు నడిచింది రేణుక. అనుసరించాడతను. ఆమె వెంట మూడేళ్ళ పాపకూడా ఉంది. కొంచెం మేర నడిచాక ఆ పాపనెత్తుకు నడిచి గుబురుగా పెరిగిన క్రోటన్సు మొక్క దగ్గర చతికిలబడి కూర్చుని పాపని వళ్ళో కూర్చోబెట్టుకుంటూ కూర్చోండి శ్యామ్ మిమ్మల్ని చూస్తే, మీరు నన్ను చూడాలని స్కూలుకి వచ్చారంటే నా కెంత ఆనందంగా ఉందో తెలుసా ? అంది రేణుక.

'పార్వతి బాగుంది. దానికి మేరేజ్ అయిపోయింది. అత్తవారింట్లోనే ఉందిప్పుడు. మా నాన్నగారికి విశాఖనుంచి బొంబాయి ట్రాన్స్‌ఫరయింది' అన్నాడతను.

విశాఖనుంచి బొంబాయా ?

సింధియాలో పనిచేసేవారు. అక్కడ మరొక కంపెనీలో ఎక్కువ జీతంమీద జాబ్ దొరికింది. వెళ్ళిపోయాం. మీకు పెళ్ళయిందని మాత్రం విన్నాను, ఈ పాప నీ పాపేనా!

అవునన్నట్లు తలఊపి పాప తలపై గెడ్డం ఆన్చిన రేణుక కనులు నీటితో నిండాయి.

ఆయన ఎక్కడ ఉన్నారు?

నాకు పాప తప్ప ఎవరూ లేరు శ్యామ్ అందరూ నన్ను విసర్జించారు.

ఆమె నుదుట ఉన్న ఎర్రని తిలకం, సన్నని పవిటచాటున మెరుస్తూన్న మంగళసూత్రాలూ, ఆమెవైపు అయోమయంగా అర్థం కానట్టుచూస్తూ బంధువులు విసర్జించారా? ఎందుకు? ఆయన ఎక్కడ వున్నారిప్పుడు? అడిగాడు.

ఎక్కడ ఉన్నారో తెలియదు శ్యామ్. ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకున్నారని చాలాకాలం క్రితం విన్నాను.

మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడా....? శ్యామ్ కనుబొమలు ముడిపడ్డాయి.

అవును. పెళ్ళయిన ఐదు నెలలకు బిడ్డ తల్లయిన భార్యను మన దేశపు మగాడు ఏలుకోగలడా శ్యామ్? కాకుల్లా పొడిచే లోకుల్లో తలెత్తుకొ తిరగగలడా? మన సంఘం అతన్ని మనిషిగా బ్రతకనిస్తుందా? అడుగడుగునా హేళన చేసి అతన్ని కృంగదియ్యదూ? నవ్వబోయింది, నీటితెరల మధ్య ఆమె కనుపాపలు మెరుస్తున్నాయ్.

ఏమిటో నీ మాటలు నాకు అర్థం కావటం లేదు. పెళ్ళయిన ఐదు నెలలకు ఎవరు బిడ్డ తల్లి అయ్యారు?

నేనే....

రేణుకా....!

అవును శ్యామ్, జ్ఞాపకం తెచ్చుకో నాలుగు సంవత్సరాల క్రితం లంకాదహనం చూడాలని నేను కుతూహల పడుతూంటే ఇంట్లో అందరూ వారించారు. నువ్వు ఎంక్రేజ్ చేశావ్, వెళ్ళాను. నన్ను ఎత్తుకుపోయారు ఎవరో రౌడీలు నీకు తెలిసిందేగా....

తలవంచి మౌనంగా ఉండిపోయాడు శ్యామ్‌సుందర్.

గిల్లీ రక్షి- వాళ్ళని తప్పించుకున్నానని బొంకాను. కాని ఎవరో ఒక దుర్మార్గుడు నా శీలాన్ని దోచుకున్నాడు శ్యామ్. నా జీవితం నాశనం చేశాడు....ఆమె వెక్కి-వెక్కి-ఏడుస్తూ మోకాళ్ళమధ్య ముఖం దాచుకుంది అతని ముఖం కళావిహీన మయిపోయింది. ఆమెవైపు చూడలేకపోతున్నాడు. 'ఊరుకో' అనలేకపోతున్నాడెందుకనో.

అతను అడగకపోయినా ఆమె చెబుతూంది. విశాఖపట్నం నుంచి వచ్చిన నాలుగు నెలలకు నాకు కృష్ణమూర్తి గారితో వివాహ మయ్యింది. మూడునిద్రలు తర్వాత ఆయన వెళ్ళిపోయారు. అనారోగ్య కారణంగా నేను ఆయనతో వెళ్ళలేదు. తర్వాత... తర్వాత నా అనారోగ్యానికి కారణం తెలిసిపోయింది. కాని ఎవరికీ చెప్పలేకపోయాను శ్యామ్, నాలో నేనే కృంగిపోయేదాన్ని. ఓ రోజు ఏకాంతంలో కూర్చుని ఏడుస్తూన్న నన్ను మామయ్య చూశాడు. అప్పటికే మావారి దగ్గరినుంచి ఉత్తరాలు వస్తున్నాయి. నన్ను తొందరగా పంపించమని. మామయ్య 'వెళ్తావా?' అని

అడిగితే, ఆరోగ్యం చక్కబడనీ అనేదాన్ని. ఎందు కేడుస్తున్నావ్? అని ఓదార్చబోయిన మామయ్య దగ్గర నిజం దాచలేకపోయాను. విశాఖపట్నంలోని ఆనాటి సంఘటన కారణమయి ఉంటుందని చెప్పి, మామయ్య కాళ్ళకు చుట్టుకొని పసిపిల్లలా ఏడుస్తూన్న నన్ను మామయ్య తల నిమిరి ఓదార్చి, ఏమయితే అవుతుంది నేను రాను, అంటూన్న నన్ను డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళారు,

మామయ్య చాటుగా అతనితో ఏమో చెప్పారు. డాక్టరు నన్ను పరీక్షించి పెదవి విరిచి లాభంలేదు ఐదు నెలలు నిండాయి అన్నారు. ఇంకేముంది చెవులు కొరుక్కొని ఊసులు చెప్పుకుని నవ్వుకునే అమ్మలక్కలు ఇంకా మేనగోడల్ని అత్తవారింటికి పంపించవేమిటోయ్ అని అడిగే పరిచయస్థుల మధ్య మామయ్య నలిగిపోయి తలెత్తి తిరగలేకపోయేవాడు. ఎలాగన్నా ఒదిలించుకోండి మీ మేనగోడల్ని, అనేది అత్తయ్య. మామయ్య చిరాకుపడిపోయేవాడు. కృష్ణమూర్తిగారు ఉత్తరాలు వ్రాసేవారు నన్ను పంపించమని. జవాబిచ్చేవాడు కాదు మామయ్య. నాకూ వచ్చేవి ఉత్తరాలు. ఏ ముఖంతో ఏమని ఆయనకు ఉత్తరం వ్రాయగలను? అని ఆగి కనులూ ముఖం పవిటచెంగుతో తుడుచుకొని గొంతు సవరించుకొని మళ్ళీ చెప్పింది. పాప పుట్టిన నాలుగు వారాలకు కృష్ణమూర్తిగారు వచ్చారు. నన్నూ పాపనీ చూశాక ఆయనకు విషయం అర్థం కాకపోతుందా! ఆయనను క్షమించమని అర్థించాను, కాని ఇది సామాన్యమైన నేరమా! ఎలా జరిగింది! అని ఆలోచించి అర్థం చేసుకొని విశాల

హృదయంతో ఆహ్వానించగల ఔదార్యం ఎంతమంది కుంటుంది శ్యామ్? కృష్ణమూర్తిగారు సంఘంలో గౌరవంగా బ్రతకాలనుకునే సామాన్యమైన వ్యక్తి. వెళ్ళిపోయారు. తరువాత ఆయన దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. మళ్ళీ పెళ్ళికి అనుమతి పత్రం వ్రాసివ్వమని లేదా కోర్టులో విడాకులు తీసుకుంటాననీను. కోర్టుకెక్కి— ఇంకా వున్న పరువు తీసుకోవట మెందుకు ? అనుమతి పత్రం వ్రాసిచ్చాను.

తర్వాత నన్నూ మావయ్యనూ అనుమానించటం మొదలుపెట్టింది, అత్తయ్య. తలిదండ్రులు పోయిన నన్నూ చెల్లినీ తల్లీ తండ్రీ తానే అయి పెంచిన మామయ్య ఇలాటి నిందకు గురికావటం నేను భరించలేకపోయాను. పాపను ఆ ఇంట్లో వదలి ట్రయినింగ్‌కి వెళ్ళాను. ఈ టీచరు పోస్టు వచ్చింది.

మామయ్య పోయాడుట సంవత్సరం క్రితం, నేను వెళ్ళలేదు. పాపను తీసుకు ఆ ఇంటినుంచి వస్తూంటే, అత్తయ్య ఆజ్ఞాపించింది. ఇహ జన్మలో ఎప్పుడూ ఏ పరిస్థితుల్లోనూ వారికి నా ముఖం చూపించవద్దని. వారినైనా గౌరవంగా నలుగుర్లో తలెత్తుకు తిరగనీయమని. ఇంకా నీ చెల్లెలికి పెళ్ళి అవాలంటే, నువ్వు మాతో సంబంధం పూర్తిగా తెంచుకుపోవాలి అని.

నేను చేసిన తప్పేమిటి? శ్యామ్. పుట్టినవెంటనే పాపని చంపేస్తే బాగుంటుందని ఆత్మీయుల సూచన. నేను సమ్మతించలేదు శ్యామ్. పాప ఏ నేరం చేసిందని కళ్ళు తెరవకుండా హత్య చెయ్యాలి ! పాప తండ్రి ఎవరో తెలుస్తే. ....

'తెలుస్తే ఏంచేస్తావు రేణూ, జాలి ధ్వనించిందా గొంతులో'.

"నన్ను పెళ్ళి చేసుకోమంటాను."

'నువ్వు పెళ్ళి చేసుకోకుండా వుండిఉంటే తప్పకుండా కునేవాడు.'

కనులు తుడుచుకొని గలగలా నవ్వి మీరు బాగానే జోక్‌లు వెయ్యగలరు శ్యామ్. మీ మాటలంటే నా కెంతో ఇష్టం. నిజమే. అతను మన దేశపు మగవాడు కాదేమిటి! మరొక వ్యక్తి అనుభవించిన....ఎంగిలయిపోయినదానిని ఎలా స్వీకరిస్తాడు భార్యగా....సర్లే ఏదో అయిపోయింది. మిమ్మల్ని బోర్ కొట్టేశానులా ఉంది. అసలు మీరీ ఊరు ఎందుకు వచ్చారు? నేనిక్కడ ఉన్నానని తెలుసా! నన్ను చూడాలనా? అడిగింది ఆశగా,

" పెళ్ళి చూపులకు."

"ఓ....మీ కింకా పెళ్ళికాలేదా! ఎవరమ్మాయిని?"

'లాయరుగారి అమ్మాయిని. ఊరు పరిసరాలూ చూడాలని ఇలా వస్తూ నిన్ను చూసి గుర్తుపట్టాను.'

రెండు క్షణాల నిశ్శబ్దం తర్వాత "విశాఖపట్నంలో ఆడపిల్లల్ని ఎత్తుకుపోయి చెరిచే రౌడీలెవరో మీకు తెలిస్తే వారి దగ్గర నా కథ చెప్పు శ్యామ్" అంది రేణుక.

'అలానే' అని లేచి బరువుగా నడుస్తూ వెళ్ళిపోయాడతను. నవ్వుతో అతనికి వీడ్కోలిచ్చింది కాని తనను చెరచిన రౌడీ ఈ శ్యామ్‌సుందర్ అని తెలియదామెకు.